# ఇది కథ కాకూడదు

## ఎం. వి. ఎస్. ఎస్. ప్రసాద్

ఉదయం తొమ్మిది గంటలయింది రోజూ ఉదయం ఎనిమిది గంటలకే నర్సింగ్ హోంకి బయలుదేరడం అలవాటు నాకు ఎనిమిదిం పావుకల్లా నేను కారు దిగకపోతే నర్సింగ్ హోం దగ్గర వేచి ఉండే పేషంట్స్, నా అసిస్టెంట్స్ కూడా ఇక ఆ పూటకో లేదా ఆ రోజుకో రానని నిర్ణయించుకుంటారు ఎందుకంటే గత పది, పదిహేను సంవత్సరాలలో నేను ఆలస్యంగా వెళ్ళిన సందర్భాలు వేళ్ళ మిద లెక్కపెట్టవచ్చు

ఆ రోజు గంట ఆలస్యంగా కారు దిగుతున్న నన్ను చూసి నా అసిస్టెంట్ డాక్టర్ స్వరూప్ ఆశ్చర్యంగా "ఏమిటి డాక్టర్ ఇంత ఆలస్యం అయింది"? ఇక ఈ రోజు ఏ కారణం చేతనైనా మీరు రారేమోనని విశ్వం వచ్చే వరకూ ఉండి పోదామనుకున్నాను' అన్నాడు

"రాత్రి సరిగ్గా నిద్ర పట్ట లేదు స్వరూప్ అందుచేత ఆలస్యం అయ్యింది రింగ్ చేద్దామంటే ఫోన్ పని చేయడం లేదు' అన్నాను నేను కన్సల్టింగ్ రూములోకి దారి తీస్తూ

'మీ ఇంటికి ఫోన్ ట్రై చేసా డాక్టర్ బహుశా మీ ఫోన్ పని చేయనందు వల్లనేమో కంటిన్యూస్‌గా ఎంగేజ్‌డ్ సౌండ్ వచ్చింది" అన్నాడు స్వరూప్ నా ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ

'ఎనీ థింగ్ స్పెషల్?" అని అడిగాను కళ్ళు చిట్లిస్తూ

"అంతా ఓ! కె! డాక్టర్ కానీ పదవ నెంబరు గదిలో నిన్న అడ్మిట్ అయిన కుర్రాడు మాత్రం రాత్రంతా చాలా రెస్ట్‌లెస్‌గా ఉన్నాడు

"ఆఁహాఁ! నేను సరిగ్గా నిద్ర పోలేక పోవడానికి కారణం కూడా కొంత వరకూ ఆ కుర్రాడే."

డాక్టర్!! మీరు అతనిని వెంటనే చూస్తే మంచిదేమో" అన్నాడు స్వరూప్ ఒక్కసారిగా

"కండీషన్ అంత బాడ్‌గా ఉందా!!?"

"బాడ్ అని అనను గాని ..

"రైట్ అయితే వెంటనే చూద్దాం పదండి" అంటూ పదవ నెంబరు గదిలోకి నడిచాను స్వరూప్, సిస్టర్ నివేదిత నన్ను అనుసరించారు

'నమస్కారం డాక్టర్‌గారూ" కుర్రాడి తల్లి చేతులు జోడించింది నిద్రలేమి, అలసట, బెంగ వలన ఆమె ముఖం నీరసంగా ఉంది.

"నమస్కారం ఏమిటీ!!? బాబు ఎలా ఉన్నాడు?" అని ప్రశ్నించాను

రాత్రంతా చాలా బాధ పడ్డాడండీ. ' ఆమె కంఠం పూడుకుపోయింది కళ్ళమ్మట నీళ్ళు ధారగా కారుతున్నాయి

"పరవాలేదమ్మా. మీరేమీ కంగారు పడకండి అతను త్వరలోనే కోలుకుంటాడు మందులు మాత్రం చెప్పినట్లు వేయండి" అన్నాను నేను కుర్రాడిని పరీక్షించిన తరువాత అతని పరిస్థితి ఏ మాత్రం మెరుగు అవలేదనే విషయం తేటతెల్లమయింది అయితే నాకు అతని ప్రస్తుత పరిస్థితి నిరాశ, ఆశ్చర్యం మాత్రం కలిగించలేదు

"స్వరూప్ అవసరమయితే ఐ వి ఫ్లూయిడ్స్ ఇవ్వండి బైదివే నేను పని మీద బయటకు వెడుతున్నాను. మీరు ఇంటికి వెళ్ళి ఈ రోజుకు మాత్రం వెంటనే వచ్చేయ్యండి అవసరమైతే నైట్ డ్యూటీ నేను చేస్తాను సారీ ఫర్ ది ట్రబుల్'

"పరవాలేదు డాక్టర్ ఎటూ డాక్టర్ విశ్వం, డాక్టర్ రజని వస్తారు కదా వాళ్ళు చూస్తూంటారు ఏదైనా ప్రోబ్లెమ్ ఉంటే నేను అటెండవుతాను నేను ఒక గంటలో వచ్చేస్తాను. నైట్ డ్యూటీ వాళ్ళిద్దరిలో ఎవరో ఒకరు చేస్తారులెండి" అన్నాడు స్వరూప్

"థాంక్యూ థాంక్యూ వెరీ మచ్"

"ఇందులో థాంక్సు చెప్పాల్సిన అవసరం ఏముంది డాక్టర్!??"

'ఐ యామ్ రియల్లీ ప్రౌడ్ ఆఫ్ యు మన టీమ్ ఇలా ఉండబట్టే మన నర్సింగ్ హోంకి అంత మంచి పేరుంది" అన్నాను నేను నవ్వుతూ.

ఆ రోజుకి పేషెంట్స్‌ని చూడడం పూర్తయ్యింది స్వరూప్ త్వరగానే వస్తానని ఇంటికి వెళ్ళాడు. నేను కన్సల్టింగ్ రూమ్‌లో పరధ్యానంగా మెడికల్ బుక్స్ తిరగేస్తున్నాను ఆ రోజు పోస్ట్ వచ్చింది మెడికల్ జర్నల్సు వచ్చాయి వాటిని తిరగేస్తూ కూచున్నాను నా దృష్టి హఠాత్తుగా ఒక చోట కేంద్రీకృతమైంది నా భ్రుకుటి ముడి పడింది గుండె వేగం హెచ్చింది చదివిందే మళ్ళీ, మళ్ళీ చదివాను నా మనస్సంతా ఏదో ఉద్వేగంతో, ఉత్సాహంతో ఊగిసలాడింది. వెంటనే ఫోన్ తీసి ఒక నెంబరు డయల్ చేసాను

"హలో మిష్టర్ రావ్!! డాక్టర్ ప్రసాద్‌ని మాట్లాడుతున్నాను ఆ స్థలాల విషయమై మాట్లాడడానికి ఈ రోజు వస్తానన్నాను కదా సారీ రావడం కుదరదు. అనుకోకుండా వేరే పని తగిలింది ఇంకో రోజు వస్తాను. వచ్చే ముందు ఫోన్ చేస్తాను" అంటూ అవతలి వ్యక్తికి మాట్లేదేందుకు అవకాశం ఇవ్వకుండా ఫోన్ పెట్టేసాను తరువాత ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్స్‌పరిమెంటల్ మెడిసిన్‌కి ఫోన్ చేసి ప్రొఫెసర్ నవనీత్‌తో ఇంటర్వ్యూ తీసుకున్నాను ఒక గంట తరువాత రమ్మని చెప్పాడాయన

ఒక గంట సేపు ఎలా గడిచిందో నాకే తెలియదు స్వరూప్ వచ్చాడు

స్వరూప్ నేను అర్జంట్ పని మీద వెడుతున్నాను వచ్చేసరికి ఏ వేళ అవుతుందో తెలియదు బహుశా ఈ వాళ అందరం నైట్ డ్యూటీ చేయాల్సి ఉంటుందేమో!' అన్నాను సాలోచనగా

'డాక్టర్ మీరు చెపుతున్నదేమిటో అర్థం కావడం లేదు!' అన్నాడు స్వరూప్.

'ఇప్పుడు చెప్పే వ్యవధి కానీ, కుతూహలం కానీ లేవు నే వస్తాను' అంటూ గబగబా వీధి గుమ్మం వైపు నడిచాను స్వరూప్ నా వైపు ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు.

* * * *

గుడ్ మార్నింగ్ ప్రొఫెసర్' అంటూ చిరునవ్వు నవ్వాను నేను ప్రొఫెసర్ నవనీత్ రూములో ప్రవేశిస్తూ

గుడ్ మార్నింగ్ డాక్టర్ ప్లీజ్ బీ సీటెడ్" అన్నాడు ప్రొఫెసర్ నవనీత్

'ఏమై డిస్టర్బింగ్ యూ బై ఎనీ ఛాన్స్!!??'

"నో నో డాక్టర్. నాటటాల్. అయినా డాక్టర్ ప్రసాద్ నా కోసం వచ్చారంటే ఏదో ముఖ్యమైన పని ఉండే ఉంటుంది. అంత బిజీ అయిన మీరు ఊరికే రారు కదా" అన్నాడు నవనీత్ నవ్వుతూ.

'మీ ఊహ కొంత వరకూ నిజమే . మీ ఆర్టికల్స్ మెడికల్ మేగజైన్స్‌లో చదువుతూ ఉంటాను లేటెస్ట్ మెడికల్ జర్నల్‌లో ఒక చైల్డ్ డిసీజ్ గురించి చాలా బాగా రాసారు. అది చాలా ఎనలటికల్‌గా ఉంది. నిజంగా మీలాంటి వ్యక్తి ఒక భారతీయుడు కావడం . మాకందరికీ గర్వకారణం.'

"ఏదో మీరలా అంటారు గాని ... న్యూటన్ మహాశయుడు చెప్పినట్టు నేను విజ్ఞాన సాగరపు టొడ్డున గులక రాళ్ళు ఏరుకునేవాడిని అయినా మెడికల్ ఫీల్డులో మిమ్మల్ని మించిన వారు ఈ దేశంలో ఎంత మంది ఉన్నారు చెప్పండి !?"

'మనది మ్యూట్యువల్ ఎడ్మైరేషన్ సొసైటీ అయిపోతోంది. . నాకు మీ సహాయం కావాలి సార్' అన్నాను ఒక్కసారి సీరియస్‌గా

"నా సహాయమా !!? ఓ! యస్ నేను చెయ్యగలిగిన దేమన్నా ఉంటే తప్పకుండా చేస్తాను."

"సార్! ఈ రోజు మెడికల్ జర్నల్‌లో మీ ఆర్టికల్ చదివిన తరువాత ఎందుకో నాలో పెద్ద తుఫాను రేగింది నేను చదివిన విషయం నన్ను విపరీతంగా ప్రభావితం చేసింది" అన్నాను నేను గంభీరంగా

"నాచురల్ డాక్టర్ అది ఒక భయంకరమైన పిల్లల వ్యాధి గురించి నేను చేసిన రీసెర్చి గురించి రాసినది. మీరు చైల్డ్ స్పెషలిస్ట్ గనుక అది మిమ్మల్ని ప్రభావితం చేయడంలో విశేషమేమీలేదే!!?"

"సార్! నాకు ఇంకా కొన్ని వివరాలు కావాలి."

"అంటే!!??.. "

"ఆ వ్యాధికి ప్రస్తుతం మందు లేదనీ, ఆ వ్యాధి సోకిన పిల్లల మరణం తథ్యమనీ, అది కూడా బాధాకరమైన మృత్యువు అనీ మీకూ తెలుసు."

'అవును!!

'ఆ వ్యాధికి మందు కనిపెట్టడానికి మీరు తీవ్రంగా కృషి చేస్తున్నారు '

"నిజమే అయితే ప్రస్తుతం అది కేవలం జంతువుల మీద ప్రయోగిస్తున్నాం వాటిపై కూడా పరిశోధన ఇంకా ప్రాథమిక దశలో ఉంది ఎలా పని 'చేస్తుంది'? సైడ్ ఎఫెక్ట్సు ఏమిటి'? టాక్సిక్ ఎఫెక్ట్సు ఏమిటి'? అనే విషయాలు ఇంకా ఏమీ తెలలేదు "

"సార్' ఒక వ్యక్తిని మనం చంపవచ్చా''? ఆహ' ఊరికేనే అడుగుతున్నాను '

'వ్హాట్'' డాక్టర్ ప్రసాద్ ఈ రోజు మీకేమయ్యింది''? మీరు డాక్టరుగా కేవలం రోగులని రక్షించాలి గాని అటువంటి ఆలోచనైనా రానివ్వకూడదు

"అది కాదు సార్' కొన్ని, కొన్ని వ్యాధులకు మందులేదు కదా అటువంటి వారిని శాంతియుతంగా చావనిస్తే మంచిదేమో ఈ విషయమై కొన్ని దేశాలలో ఉద్యమాలు కూడా మొదలు పెడుతున్నారు చనిపోయే హక్కు మనిషి కుండాలని, ఏ విధంగానూ నయం కాని వ్యాధులతో బాధపడే వారు చనిపోయే స్వేచ్ఛను కలిగి ఉండాలని బంధువుల అనుమతిపై డాక్టర్లు మృత్యువుని అటువంటి వ్యక్తులకు త్వరగా వచ్చే ఏర్పాట్లు చేసే విదంగా చట్టాలు మార్చాలని అన్నాను నేను

కాని ఏ నాగరిక దేశం, చట్టం అటువంటి పనులకు ఒప్పుకోవు. ఒప్పుకోకూడదు అన్నాడు నవనీత్ చాలా ధృడంగా.

కానీ ఒకమ్మాయి విషయంలో కోర్టు కూడా ఒప్పుకుంది సార్ . బహుశా ఇంగ్లండులో అనుకుంటా అనేక సంవత్సరాలుగా జీవచ్ఛవంలా పడి ఉన్న పసిపాపకు ఆక్సిజన్ వగైరా సరఫరా ఆపు చేయమని తల్లిదండ్రులు పెట్టుకున్న అర్జీ కోర్టు ఒప్పుకుంది ఆ పాప శాంతియుతంగా మరణించింది కూడా రోజా ఆ పాపని చూడడం బాధ పడడం కన్నా ఆ తల్లిదండ్రులకు అదే నయమనిపించింది''

'అయ్యిండొచ్చు కాని అటువంటి చట్టం వస్తే అనేక లీగల్ కాంప్లికేషన్స్ ఎదురు అవుతాయి స్వార్థపరులు తమకి అడ్డుగా ఉన్న వ్యక్తులని, ఇష్టంలేని వ్యక్తులని వదులించుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది '

"అవచ్చు సార్ కానీ మనం మనిషిని బ్రతికించలేక, చంపలేక అతనికి చనిపోయేందుకు స్వేచ్ఛను ఇవ్వలేక'' ఎందుకో ఆవేశాన్ని ఆపుకోలేక పోతున్నాననిపించింది నాకు

మళ్ళీ నేనే 'సార్' ఒకవేళ తప్పని పరిస్థితులలో నేనే ఒక వ్యక్తికి నిశ్చితమైన మరణాన్ని త్వరిత పరిస్తే''?' అన్నాను

"డాక్టర్''?? వాటార్ యు టాకింగ్''? అటువంటి పనిని కలలోనైనా తలపెట్టకండి అటువంటిదే జరిగితే మీరు చట్టం దృష్టిలోనే కాక సమాజం దృష్టిలో కూడా నేరస్థులవుతారు'

పోనీ అలా చెయ్యక పోయినా మీరు జంతువులపై ప్రయోగించే మందు నాకివ్వగలరా''

డాక్టర్''?? వాట్ హాపెండ్ టుయూ'? ఈ రోజు ఎందుకలా ప్రవర్తిస్తున్నారు''? ఎందుకలా మాట్లాడుతున్నారు'''? మీరు ఆ మందుతో ఏం చెయ్యదలుచుకున్నారు''? అన్నాడు నవనీత్ ఆశ్చర్యం, భయం మిళితమైన స్వరంతో


నేనొక వ్యక్తిపై ప్రయోగిస్తాను ' సాధ్యమైనంత నెమ్మదిగా అన్నాను నేను 'అవును సార్' మీరు ఏ వ్యాధిపై రీసెర్చి చేస్తున్నారో, ఆ వ్యాది కల ఒక పేషంట్ ప్రస్తుతం నా నర్సింగ్ హోంలో ఉన్నాడు

"ఏమిటి''??? మీరు ఆ మందుని ఒక వ్యక్తిపై ప్రయోగిస్తారా'?

నో'' నో'' ఇటీజ్ ఇంపాసిబుల్ ఇంకా జంతువులపై ప్రయోగాలే ప్రాథమిక దశలో ఉన్న ఒక మందుని మనుషులపై ప్రయోగించడం ప్రమాదకరం, అమానుషం, నేరం నే నొప్పుకోను అయామ్ సారీ" అంటూ తల దించుకున్నాడు నవనీత్

"మన కళ్ళ ముందే మనిషి భయంకరమైన బాధతో చనిపోతూ ఉంటే చూస్తూ ఊరుకోవడం అమానుషం కాదంటారా!'? అది నేరం కాదా'? సార్ మిమ్మల్ని అర్థిస్తున్నాను ప్లీజ్'' ప్లీజ్''' అన్నాను నేను ఆవేశంగా

కానీ కానీ డాక్టర్ అది నేరం తీవ్రమైన



పరిణామాలను ఎదుర్కోవలిసి వస్తుంది"

'నాకేమైనా పరవాలెదు సార్ నన్ను జైల్లో పెట్టినా, ఉరి తీసినా, ఏం చేసినా పరవాలేదు . . నాకా మందు ఇవ్వండి సార్. ప్లీజ్ మీ బాధ్యత ఏమీ లేదనీ అంతా నాదేనని ఉత్తరం రాస్తాను. పోలీసులకు చెపుతాను!!" ఉద్వేగంతో నా కంఠం అదోలా ధ్వనించింది

"ప్లీజ్ డాక్టర్ కామ్ డౌన్. అసలు ఇంత ఎక్ట్రీమ్ స్టెప్ ఎందుకు తీసుకోవాలనుకుంటున్నారు!?"

"సార్!! నిన్న ఉదయం ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. అది నన్ను విపరీతంగా కదిలించి వేసింది. నేను రోజూ లాగానే నర్సింగ్ హోమ్‌లో అడుగు పెట్టాను. 'నా బిడ్డని చంపెయ్యండి డాక్టర్!! నా బిడ్డని చంపెయ్యండి!!' అంటూ ఒక మధ్య వయస్కురాలు నా కాళ్ళ మీద పడింది. ఒక్క నిమిషం నాకేమీ అర్థం కాలేదు. నే విన్నది పొరపాటేమోనని అనుకున్నాను పలానా. వారిని బతికించమని కాళావేళ్ళా పడ్డం చూసాను గాని అలా జరగడం నా జీవితంలోనే మొదటిసారి. తరువాత విచారిస్తే ఆమెకు ఒక కొడుకు ఉన్నాడనీ, అతను ప్రస్తుతం మనం నయం చేయలేని ఒక భయంకర వ్యాధితో బాధపడుతున్నాడనీ, ఆ బాధను చూడలేక ఆమె అలా దీనంగా అర్థించిందనీ తెలిసింది వెంటనే నాకు ఇందాక మీకు చెప్పిన సంఘటన గుర్తుకు వచ్చింది ఆ పాపకీ నిన్న వచ్చిన కుర్రాడికీ చాలా పోలికలు కనిపించాయి

. . . . కానీ ప్చ్!! ఆ క్షణంలో మీరు చెప్పిన చట్టం, సంఘం నన్ను నిర్వీర్యుణ్ని చేసాయి అదీ ఒకందుకు మంచిదే అయిందనుకోంది నిన్న రాత్రంతా నాకు నిద్దర పట్టలేదు కానీ ఈ రోజు మీరు రాసినది చదివాక ఒక కొత్త వెలుగు' కనిపించింది ఒక ఆశ జనించింది ఒక నిర్ణయానికి వచ్చాను సార్ డాక్టర్‌గా ఇన్నాళ్ళ అనుభవం ఉన్నా నిన్నటి సంఘటన నన్ను విపరీతంగా కదిలించి వేసింది ఇంక మాట్లాడలేక ఆగిపోయాను

# ఇది కథ కాకూడదు

"ఓ! రియల్లీ ఇంటరెస్టింగ్' అన్నాడు నవనీత్

'అవును సార్ నాకు ఎందుకో ఛాలెంజ్ తీసుకోవాలనిపిస్తోంది అయినా ఏమవుతుంది? ఆ కుర్రాడు చనిపోతాడు అంతే కదా ఎటూ 3, 4 నెలల్లో జరిగేది అదే కదా! .. నేనీ రిస్క్ తీసుకుని మందు వాడితే, సమ్‌మిరకల్ జరిగి కుర్రవాడు కోలుకుంటే జీవితంలో నాకు అంత కంటే సంతోషం ఉండదు ప్లీజ్ ప్రొఫెసర్ . ప్లీజ్' అంటూ అర్థించాను

"వెల్ దో మిరకిల్స్ ఆర్ నాట్ కామన్ దేయూ అక్కర్ సమ్ టైమ్స్"

"నేను మీకు ఏమీ కాకుండా ఎలా రాసి వ్వమంటే అలా రాసిస్తాను ఏం చేయమంటే అది చేస్తాను" అన్నాను నేను 5 నిమిషాలు ఆ గదిలో నిశ్శబ్ధం రాజ్యం చేసింది

'మీరేమీ చెయ్యక్కర్లేదు. లెటజ్ టేక్ ది చాలెంజ్ టు గెదర్ ఈ విషయంలో ఏమైనా బాధ్యత వహించడానికి నేను సిద్ధమే" అన్నాడు నవనీత్ కుర్చీలోంచి లేస్తూ, నా కళ్ళమ్మట కృతజ్ఞతా పూర్వక ఆనందబాష్పాలు రాలడం ప్రారంభించాయి

* * * *

"చూడండి స్వరూప్, విశ్వం, రజనీ ఈ రోజు పదవ' నెంబరు గదిలో కుర్రాడికి అత్యంత ప్రమాదకరమైన మందు అంటే ఇంకా జంతువుల మీద కూడా ప్రయోగాలు పూర్తి కాని మందు ప్రయోగించాము మనం అతనిని కంటికి రెప్పలా కాపాడాలి ఇంక ఇరువయి నాలుగు గంటల వరకూ అనుక్షణమూ మనలో ఒకరం అతని దగ్గర ఉండాలి అఫ్‌కోర్స్ నేను ఇక్కడే ఉంటాను మీలో ఒక్కొక్కరూ ఇంటికి వెళ్ళి రెస్ట్ తీసుకురావచ్చు అన్నాను నేను

అలాగే డాక్టర్ అన్నాడు స్వరూప్. మిగతా ఇద్దరూ తలలూపారు వాళ్ళందరి మొహాల్లోనూ ఆందోళనా, సంభ్రమాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి ప్రళయం రాక ముందే గ్రహించిన వ్యక్తుల్లా ఉన్నారు వాళ్ళు ముగ్గురూ

ఆ తరువాత ఇరువయి నాలుగు గంటలూ ఇరువయి నాలుగు రోజులలా గడిచాయి చిన్న, చిన్న సమస్యలు వచ్చినా జాగర్తగా మానేజ్ చేయగలిగాం

రెండవ రోజు ప్రొఫెసర్ నవనీత్‌కి ఫోన్ చేసి విషయం చెప్పాను ఆయన ఒక్క ఉదుటున మా నర్సింగ్ హోమ్‌కి వచ్చి నన్ను కౌగలించుకుని అభినందించాడు. పది రోజులు గడిచాయి కుర్రాడి పరిస్థితిలో మంచి మార్పు కనిపించింది నా ఆనందం వర్ణనాతీతం ప్రొఫెసర్ నవనీత్ రోజూ వచ్చి కుర్రాడిని చూసి, నాతో కొన్ని విషయాలు చర్చించి వెడుతున్నాడు.

ఆ రోజు ఆ కుర్రాడి తల్లి కన్సల్టింగ్ రూములోకి వచ్చింది గబుక్కున నా కాళ్ళు చుట్టేసి "నా బిడ్డని బ్రతికించండి డాక్టర్!! నా బిడ్డని బ్రతికించండి" అంటూ కళ్ళ నీళ్ళ పెట్టుకుంది నా హృదయం ఆనందంతో నాట్యం చెయ్యసాగింది అప్పుడే లోపలికి అడుగు పెడుతున్న ప్రొఫెసర్ నవనీత్ కళ్ళల్లో ఆనందం స్పష్టంగా కనపడసాగింది నాకు. □

## "వృక్ష నీతి"

ఆకు –
ఔషధాన్నిస్తుంది!
పూవు –
తేనె నిస్తుంది!
కాయ –
ఆహారమౌతుంది!
వేరు మొదటి నుండి
కొమ్మ చివరి వరకూ
వంట చెరుకు కూ
రకరకాల
పరికరాలకూ
ఉపయోగపడుతుంది!
చివరకు
కాలిపోయిన
'బూడి దె'కూడా
మనిషి మనుగడకు
సహకరిస్తుంది!!
అంతటి మహోన్నతమైన
త్యాగానికి
సాక్షిగా నిల్చిన
"వృక్ష" నీతిని
మానవుడు
ఆదర్శంగా తీసుకుంటే–
భువి
దివిగా మారిపోదూ!!!!

-రాపోలు పరమేశ్వరరావు

